జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 13-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 453 పేజీలు: 4 వెల : రూ.7



# శ్రీకాకుళం టు.. ఒడిశా!



* నిత్యం ఆంధ్రా బోర్డర్ మీదుగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం
* చెక్‌పోస్టులు ఉన్నా పట్టుబడని వైనం
* అక్కడ వద్ద నిఘా అంతంత మాత్రమేనన్న విమర్శలు
* కాసులకు కక్కుర్తిపడి వదిలేస్తున్నారన్న అపవాదు
* ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోని రెవెన్యూ అధికారులు
* జిల్లాలోని రైస్ మిల్లులు తనిఖీ చేస్తే వీడనున్న పీడీఎస్ బియ్యం గుట్టు
* పలు రైస్ మిల్లుల నుంచి రెవెన్యూకు మామూళ్లు
* చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులంటూ విమర్శలు

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 8 (వార్త):** శ్రీకాకుళం జిల్లా నుంచి పీడీఎస్ బియ్యం పెద్ద ఎత్తున ఆంధ్రా బోర్డర్ దాడి ఒడిశాకు చేరుకుంటోంది. జిల్లాకు చెందిన కొందరు రైస్ మిల్లర్లు ఈ బియ్యాన్ని తక్కువకు కొనుగోలు చేసి ఒడిశాలోని మిల్లులకు అధిక మొత్తంలో విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. బోర్డర్లలో ఉన్న చెక్‌పోస్టుల వద్ద అసలు వాహనాలు చెక్ చేస్తున్నారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. రైస్ మిల్లులకు ఈ పీడీఎస్ బియ్యం ఎలా చేరుతుందన్న దానిపై రెవెన్యూ, పోలీసు అధికారులు నిఘా పెట్టడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బియ్యాన్ని ప్రతినెలా రేషన్ డీలర్ల వ్యవస్థ అందజేస్తున్నాయి. ఈ బియ్యాన్ని కొందరు దళారులు ప్రజలు, డీలర్ల నుంచి కిలో రూ.20లు చొప్పున కొనుగోలు చేసి రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు. ఈనెల 8న కోటబొమ్మాళి, టెక్కలి నుంచి ఓ వ్యాన్‌లో పది టన్నులు పైబడి పీడీఎస్ బియ్యాన్ని ఒడిశాలోని భువనేశ్వర్‌కు తరలిస్తుండగా కాశీబుగ్గ పోలీసులు పలాస టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఎవరో ముందస్తు సమాచారం ఇవ్వడం వల్ల పట్టుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. అలాగే ఈనెల 5న కొత్తూరు మండలం నివగాం గ్రామంలోని ఇప్పిలి గోవిందరావుకు చెందిన శ్రీసత్యనారాయణ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 300 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ డీఎస్‌పీ సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. అదే సమయంలో ఒక బొలేరో వాహనంలో మరో 68 బస్తాల పీడీఎస్ బియ్యం తరలించేందుకు మిల్లు యజమాని సిద్ధం చేయగా, వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు మండలంలో పీడీఎస్ బియ్యం రవాణా జోరుగా సాగుతోంది. అధికారుల కళ్లుగప్పి హడ్డుబంగి మీదుగా ఒడిశాకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ కాసులు చేసుకుంటున్నారు. ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తే, ముందస్తు సమాచారం ఇస్తే తప్ప రెవెన్యూ, పోలీసులు దాడులు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పలువురు రెవెన్యూ అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతుండడంతో రైస్ మిల్లులపై కన్నెత్తి చూడడం లేదన్న గుసగుసలు బహిరంగంగానే ఉన్నాయి. జిల్లాలోని రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తే అసలు గుట్టు బయటపడే అవకాశం ఉంది. ఆ దిశగా జాయింట్ కలెక్టర్ తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.





## రైతులూ.. ఎరువులకు..
# ఆందోళన చెందకండి

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 12(వార్త):** రైతులూ ఎరువులకు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులను భరోసా కల్పించారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్‌కు పలువురు రైతులు తమకున్న ఎరువుల సమస్యలపై కలెక్టర్‌కు వివరించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో రైతుల రెండవ సారి ఎరువులు ఇంకా అందలేదని, ఎరువులు ఎప్పుడు వస్తాయని కలెక్టర్ ను అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంత భూమి ఉందని, యూరియా వచ్చిందా లేదా, ఇంత వరకు యూరియా తీసుకున్నారా, లేదా, ఎన్ని బస్తాలు తీసుకున్నారు, తీసుకుంటే ప్రభుత్వం నుండా లేక ప్రైవేటు వారి నుండా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇంత వరకు యూరియా తీసుకోని రైతులకు సంబంధించి సంబంధిత మండల వ్యవసాయ అధికారులకు తెలియజేసి తక్షణమే యూరియా అందే విధంగా చర్యలు చేపడతామని రైతులకు ఆత్మస్థైర్యాన్ని అందించారు. పలువురు రైతులు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్ లో నేరుగా జిల్లా కలెక్టర్ తో మాట్లాడి వారి వారి సమస్యలను కలెక్టర్ కు వివరించారు. ఎరువుల పై రైతులు ఆందోళన చెందవద్దని రెండు రోజుల్లో ఎరువులు వస్తాయని, రైతులు ఎరువులకు ఆందోళన చెందవద్దన్నారు. సమస్యలు ఉంటే డయల్ యువర్ కలెక్టర్ ఫోన్ నంబర్లు లి08942222565, 08942222648కు తెలియజేయాలన్నారు.



## గంజాయి రవాణా, విక్రయంపై..
# నిఘా పెంచండి



* నిర్మూలనకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు * 14 మంది ఆస్తులు అటాచ్ * 1119 మందిపై షీట్లు * 51 మందిపై పీడీ యాక్ట్ * విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి * ఎస్పీలతో సమీక్ష

**విశాఖపట్నం/శ్రీకాకుళం, సెప్టెంబర్ 12(వార్త):** గంజాయి తరలింపు, విక్రయాలను అడ్డుకోవాలని, నిఘాను మరింత పెంచాలని ఎంతటి వారైనా వదిలేది లేదని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి హెచ్చరించారు. శుక్రవారం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, మరియు వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలను డీఐజీ ఇచ్చారు. గంజాయి నిర్మూలనలో స్పష్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులను అటాచ్ చేశామన్నారు. ఇప్పటివరకు 1119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచామని, 51 మంది నిందితులపై పీడీ చట్టం, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలు చేస్తున్నామన్నారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది నేరస్తులు, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మంది నేరస్తులను గుర్తించడం జరిగిందని తెలిపారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ల ఆధారంగా 341 మందిని పట్టుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు విధించబడ్డాయని, వీరిలో 24 మందికి 10 నుండి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయని డీఐజీ తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా గంజాయి రవాణా మార్గాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి రవాణా పూర్తిగా అరికట్టే వ్యూహం రూపొందించాలని సూచించారు. స్త్రీలు, చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, తప్పిపోయిన మహిళలు, బాలికల కేసులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎరువుల దుకాణాల తనిఖీ

**మెలియాపుట్టి సెప్టెంబర్ 12 (వార్త):** మెలియాపుట్టి మండల కేంద్రంలో గల ఎరువుల దుకాణాలను టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. షాపులలో ఉన్న యూరియా నిల్వలకు రిజిస్టర్లకు స్టాక్ వివరాలు సక్రమంగా ఉన్నది లేనిది పరిశీలించారు. శేఖరాపురం గ్రామానికి చెందిన ఎన్ని జగన్నాధరావు అనే రైతుతో ఆర్డీవో మాట్లాడారు. యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయన ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ రైతులకు తగు మోతాదులో ఎరువులు అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట తహసిల్దార్ పాపారావు వ్యవసాయధికారిని శారద, సీనియర్ సహాయకులు జగన్మోహన్ రావు, వీఆర్వో రామయ్య, రాజ్ కుమార్, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది తదితరులున్నారు.



### ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని

## మహిళా సంఘాల ధర్నా

**కొత్తూరు, సెప్టెంబర్ 12(వార్త):** కొత్తూరు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షులు శుక్ర వారం జిల్లా కలెక్టర్‌కి ఇమెయిల్ ద్వారా, అలాగే మండల పరిషత్ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేశారు. మండల ప్రజా పరిషత్ ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏపీఎం తరచూ విధులకు గైర్హాజరు అవుతున్నారని, మీటింగ్‌లలో గ్రామాధ్యక్షులను అవమానిస్తు న్నారన్నారు. తమ సంఘాలు తీసుకున్న తీర్మానాలను పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారం మినిట్స్ బుక్‌లను మారుస్తున్నారని తెలిపారు. మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు రవ్వల జయమ్మ మాట్లాడుతూ మా నిధులను అక్రమంగా వాడుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు, అంగీకరించనివాళ్లను మీటింగ్‌లలో కించపరుస్తున్నారన్నారు. బూరాడ రమణమ్మ మాట్లాడుతూ సర్వే చేసిన ఎన్యూ మరేటర్లకు ప్రభుత్వం విడుదల చేసిన పారితోషికాలను కూడా ఇప్పటివరకు ఇవ్వలేదని, ఉల్లాస్ నిధులను కూడా ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని ఆరోపిం చారు. ఈ కార్యక్రమంలో రవ్వల జయమ్మ, రోజై ఉమ, బూరాడ రమణమ్మతో పాటు పోర్న శ్రావణి, బోనంగి నాగమ్మ, పోత్రకొండ పార్వతి, పాలసెట్టి సింహాద్రమ్మ, బి. భారతీ, ఎస్. శిరీష, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య విద్యార్థులకు శిక్షణ



**సరుబుజ్జిలి, సెప్టెంబర్ 12 (వార్త):** వెన్నలవలస వెటర్నరీ కళాశాల విద్యార్థులకు సరుబుజ్జిలి ఏరియా ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రోణంకి ఆనందరావు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. పశువులు, పక్షులకు వైద్యం చేసినప్పుడు ముందస్తుగా తీసుకోవలిసిన జాగ్రత్తలు తెలియపరిచారు. మూగ జీవులు వాటి అనారోగ్యాన్ని నోటి ద్వారా తెలియజేయలేరని, ముఖ కవళికలు, శరీర కదలికలు బట్టి గుర్తించాల్సివుంటుందన్నారు.

## బాధితునికి కృష్ణచైతన్య పరామర్శ

**జలుమూరు, సెప్టెంబర్ 12(వార్త):** శ్రీముఖలింగం గ్రామంలో కూటమి నాయకుల దాడితో గాయాలపాలైన చింతం రాంబాబుని యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పరామర్శించి ఓదార్చారు. వైసీపీ అండగా ఉంటుందని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి జిల్లా ఉప అధ్యక్షులు బగ్గు రామకృష్ణ, మండల అధ్యక్షులు కనుసు సీతారాం నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్ మోహన్ తదితరులు ఉన్నారు.

## వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా పోలయ్య



**కొత్తూరు, సెప్టెంబర్ 12 (వార్త):** కొత్తూరు గ్రామానికి చెందిన గుదిబండ పోలయ్యకు వైస్సార్సీపీ జిల్లా ఎస్.సి. సెల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పాతపట్నంలోని వారి నివాసంలో పోలయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు గ్రామ ప్రతినిధులు మాట్లాడుతూ, గుదిబండ పోలయ్య వంటి నాయకుల ద్వారా పేదల సమస్యలు ప్రభుత్వానికి చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల వైస్సార్సీపీ కన్వీనర్ గండివలస ఆనంద్, పారాపురం ఎంపిటిసి వనుము లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు గుణపాఠం చెబుదాం

### * ఇచ్ఛాపురం చేరుకున్న అశోక్ బాబు, చెన్న కేశవులు పాదయాత్ర



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 12 (వార్త):** దళితుల్లో రిజర్వేషన్లు సృష్టించి మాలలకు అన్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాలలు గుణపాఠం చెప్పాలని రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వాహకులు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చెన్న కేశవులు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా కుప్పం నుంచి ప్రారంభించిన పాదయాత్ర శుక్రవారం ఇచ్ఛాపురం చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 42 లక్షల మంది మాలలు చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారన్న కక్షతో రాష్ట్రంలో రిజర్వేషన్ ఏర్పాటు చేసి మాలలను సామాజికంగా, ఉద్యోగ పరంగా అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను నిలిపి, క్రిమి లేయర్ విధానాన్ని స్వస్తి పలికి ప్రైవేట్ రంగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలు జనాభా పెరిగిన దాని ప్రకారం 20 శాతం రిజర్వేషన్ శాతం పెంచాలని,, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ హోదా ఇవ్వాలని,దళితుల మీద దాడులను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షులు సల్ల దేవరాజు, నూతలపాటి బాబురావు, గౌరవ అధ్యక్షులు నగిరి మోహనరావు, పందిరి లోకేష్, రామారావు, వెంకటరావు, మాధవరావు, కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్, కుందేసి ప్రియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీ నిర్వహించవద్దు!





### * ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు ఆగ్రహం

**మెలియాపుట్టి సెప్టెంబర్ 12 (వార్త):** సుర్జిని గ్రామంలో శక్తి ముఖంబిక గ్రానైట్స్ నిర్వాహకులు నిర్వహించనున్న గ్రానైట్ క్వారీ నిర్వహణకై పర్యావరణ తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో స్థానికుల ప్రజాభిప్రాయంతో అధికారులకు సంబంధము లేదా? మా సమస్యలను పట్టించుకోరా? అని ఆందోళన చెందుతూనే ఇక్కడ గ్రానైట్ క్వారీ నిర్వహణ వద్దని అక్కడికి విచ్చేసిన ఆర్డీవోకు తెలియజేశారు. శక్తి మూగాంబిక గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు పొల్యూషన్ బోర్డ్ ఆధ్వర్యంలో సుర్జిని గ్రామంలో ప్రజా అభిప్రాయ సేకరణ శుక్రవారం చేపట్టారు. సుర్జిని గ్రామంలో సుమారు 120 కుటుంబాల జనాభా నివసిస్తున్నామని అయినప్పటికీ కూడా తమ తెలియజేయకుండా, మా అభిప్రాయాలను, కష్టనష్టాలను తెలుసుకోకుండా వేరు ప్రాంతాల్లో వారిని తెచ్చి ఇక్కడ సమావేశానికి హాజరు పరచడం ఎంతవరకు సమంజసమని అధి కారులను కొర్ల చెంగల్ రావు, వేణుగోపాలరావు, పి.కూర్మానాయకులు, కరుణానిధి, ఇప్పిలి రామా రావు, కె. ధర్మారావు తదితరులు ప్రశ్నించారు. ఇక్కడ గ్రానైట్ క్వారీ నిర్వహించవద్దని గ్రామం తరపున వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ క్వారీ నిర్వహణకై జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో మీమీ అభిప్రాయాలను పై అధికారులకు నివేదిక పంపించడం జరుగుతుంద న్నారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ పెద్దింటి చంద్ర రావుతో మాట్లాడగా సుర్జిని గ్రామములో శక్తి ముఖం బిక గ్రానైట్స్ వారు ఏర్పాటు చేయనున్న గ్రానైట్ క్వారీ నిర్వహణకు పంచాయతీ తరపున ఎటువంటి ఎన్ఓసి ఇవ్వడం జరగలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోల్లతో పాటు స్థానిక తహసిల్దార్ పాపారావు, పర్యావరణ శాఖధికారులు,మైన్స్ అధికారులు, పోలీస్, ఇతర శాఖధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

# కిక్కిరిసిన బస్సులో విద్యార్థుల పా(ఫీ)ట్లు!

**పలాస, సెప్టెంబర్ 12, (వార్త):** బస్సుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని చేపట్టిన పాలకులు, అధికారులు అందుకు తగ్గట్టు అదనపు బస్సులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడానికి బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదపు టంచున ఫుట్‌బోర్డుపై ప్రయాణం సాగిస్తున్నారు. పలాస మండలంలోని గొప్పిలి రెంటికోట, అల్లుఖోల, లొద్దభద్ర గ్రామాల నుంచి దాదాపు 150 మంది విద్యార్థులు పలాస జూనియర్ కళాశాలకు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి బస్సులో వెళుతుంటారు. ఈ రూట్లలో 4 బస్సులు తిరుగుతున్నప్పటికీ విద్యార్థులు వెళ్లే సమయానికి ఒకే ఒక్క బస్సు సర్వీసు మాత్రమే ఉంది. పాఠశాలకు, కళాశాలలకు వెళ్లడానికి, రావటానికి ఉన్న బస్సులో అధిక రద్దీ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో ఆర్టీసీ అధికారులు మరిన్ని బస్సు సర్వీసులను నడిపితే విద్యార్థుల ఇబ్బందులు తొలగించవచ్చు. అయితే వారు ఆదిశగా చర్యలు తీసుకోకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆర్టీసీ సిబ్బంది కూడా విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం బస్సు సర్వీసులను పెంచకపోవటం వల్లనే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి విద్యార్థులకు ప్రమాదకరమైన ప్రయాణం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.





## నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

**సరుబుజ్జిలి, సెప్టెంబర్ 12 (వార్త):** సరుబుజ్జిలి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కావడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే మురుగునీరు, వర్షం నీరు ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మురుగునీరు నుంచి దుర్వాసన వస్తోంది. దోమల బెడద పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు విస్తరణ పనులతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### మూలకుచేరిన

## చెత్తసంపద కేంద్రాలు



**జి.సిగడాం,సెప్టెంబర్ 12 (వార్త):** చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో రూ. లక్షలు వెచ్చించి ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. లక్షల నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారాయి. జగన్నాధవలస గ్రామంలో నిర్మించిన కేంద్రం శిథిలావస్థకు చేరింది. వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో ముళ్లపొదలు, చెట్లు పెరిగి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

### పరిసరాలు ఇలా ఉంటే

## రోగాలు రావా?

**జి.సిగడాం, సెప్టెంబర్ 12 (వార్త):** జగన్నాథవలస ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ మురుగునీరు పేరుకుపోయింది. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనా నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులకు తరగతి గదుల్లో పాఠాలను బోధించే సమయంలో దుర్వాసన రావడంతో విద్యార్థులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చుట్టూ ప్రక్కల నివసిస్తున్న ప్రజలు కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పారిశుధ్య నీరు నిల్వ ఉండడంతో దోమలు ఈగలు వ్యాప్తి చెంది రోగాల పాలవుతున్నారు. అధికారులకు, పాలకులకు చెప్పిన స్పందిచడం లేదని గ్రామస్తులు చెప్పుకోస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## డీఐపీఆర్ఓగా బాధ్యతలు స్వీకరించిన బాలమాన్ సింగ్



**వీరఘట్టం, సెప్టెంబరు 12(వార్త):** సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు, పార్వతీపురం మన్యం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి(డీఐపీఆర్ఓ)గా బాలమన్ సింగ్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతవరకు డీఐపీఆర్ఓగా వ్యవహరించిన ఎల్.రమేష్ పదోన్నతిపై గుంటూరుకు బదిలీకావడంతో ఆయన స్థానంలో సింగ్‌ను నియమిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. 2019 - 2021 మధ్య కాలంలో పార్వతీపురం డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా బాలమన్ సింగ్ పనిచేశారు. 2022లో శ్రీకాకుళం జిల్లా పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి పొంది, ప్రస్తుతం పాడేరు జిల్లా పౌర సంబంధాల అధికారిగా పని చేస్తున్నారు. ఈయనకు పదోన్నతి కల్పిస్తూ పార్వతీపురం సమాచార శాఖలో సహాయ సంచాలకులుగా ప్రభుత్వం నియమించింది.

# ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమించాలి

**యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు**



**మందస, సెప్టెంబరు 12(వార్త):** అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినా ఏ ఒక్క డిమాండ్ నెరవేర్చలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు ప్రభు త్వాన్ని దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మందస మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సందర్శించి, ఈనెల 15న యూటీఎఫ్ చేపడుతున్న రణభేరి జాతాను జయప్రదం చేయాలని కోరారు. జీఆర్ పురం, మందస, బైరిసారంగపురం, సొండి పూడి, హరిపురం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీ కరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూప కుండా ప్రభుత్వమే విద్యా వ్యవస్థను బలహీన పరచిందన్నారు. తాత్కాలిక నియామ కాలే తప్ప శాశ్వత నియామకాలు లేని వ్యవస్థగా పర్యవేక్షణా వ్యవస్థ తయారైందని విమర్శించారు. మూడు నెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రైవేటుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారని ధ్వజమెత్తారు. ఈ 25న విజయవాడలో వేలాదిమందితో 'బహిరంగ సభ' నిర్వహించి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం ద్వారా 'రణభేరి' మోగించాలని నిర్ణయించిందన్నారు. యూటీయఫ్ చేపట్టిన ఈ ఉద్యమానికి ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల పూర్వపు అధ్యక్షుడు పిన్నింటి కొండలరావు, జిల్లా కౌన్సిలర్ గున్న చంద్రశేఖర్, జీఆర్ పురం, మందస, భైరిసారంగపురం, హరిపురం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణ మూర్తి, శ్రీనివాసరావు, బొడ్డేపల్లి గోపీచంద్, స్వప్న, మురళి, రామారావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, మల్లికార్జునరావు, పీజీటీ రమణబాబు, గుంట తేజేశ్వరరావు, దున్న కృష్ణారావు, నాగమణి, తులసి, ఎల్.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పవర్‌ప్లాంట్ వ్యతిరేక మహాధర్నాను జయప్రదం చేయాలి




**సరుబుజ్జిలి, సెప్టెంబరు 12(వార్త):** రాష్ట్ర ప్రభు త్వం థర్మల్ పవర్‌ప్లాంట్ పేరుతో చేస్తున్న బలవంతపు భూసేకరణకి వ్యతిరేకంగా ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నా జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం అధ్యక్షుడు వాబ యోగి, రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వంకల మాధవ రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయ కులు కంట అప్పలనాయుడు కోరారు. వెన్నెలవలసలో శుక్రవారం వారు ర్యాలీ జరిపి, అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. జిల్లాలో అటు కార్గో ఎయిర్‌పోర్ట్, ఇటు పవర్‌ప్లాంట్ పేరుతో పెద్ద ఎత్తున భూములు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం పూనుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వం రహస్యంగా రైతులు భూములను సర్వే ఎందుకు చేస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. జిల్లాలో అభివృద్ధి జరగాలంటే ఆమదాలవలస సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సవర లక్ష్మణరావు సవర సింహాచలం, సవర కృష్ణ, ధర్మారావు, సీఐటీయూ నాయకులు గోపాలు, రామస్వామి, మిన్నారావు, సూర్యనారాయణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**-పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**



**మందస, సెప్టెంబరు 12(వార్త):** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ఆమె హంసరాలి, మందవూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులు కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని గాలికి వదిలేశాయని విమర్శించారు. మందవూరులో రూ.30 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును ప్రారంభించారు. హంసరాలి వద్ద రూ.58 లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్, ఇంటింటికీ పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మందస, బాలిగాం పీఏసీఎస్‌ల చైర్మన్లు తమరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, రాజాన మహేష్, సాలిన మాధవరావు, ఎం.నవీన్‌కుమార్, మెట్ట మహేష్, ఔగాన ఈశ్వరరావు, పీఆర్ ఏఈ యామిని తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు హిందీ దోహదం




**పోలాకి, సెప్టెంబరు 12(వార్త):** భారత జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకత్రాటిపైకి నడిపేందుకు హిందీ భాష దోహదపడిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అన్నారు. హిందీ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో కార్యక్రమంలో శాంతి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సులభంగా నేర్చుకొని సుందరమైన భాష హిందీ అని అన్నారు. హిందీ ఉపాధ్యాయులు హేమలత, రాజేశ్వర రావు మాట్లాడుతూ విభిన్న భాషలు గల భారతదేశంలో ప్రజలందరిలో ఐక్యమత్యాన్ని పెంచి జాతీయ సమైక్యత కు ప్రతీకగా నిలిచే భాష హిందీ అని అన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు హిందీ పట్ల మక్కువ పెంచుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా "జాతీయ బాషగా హిందీ ప్రాముఖ్యత" అను అంశం మీద నిర్వహించిన వ్యాసరచన, డిబేటింగ్ మరియు క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. హిందీ ఉపాధ్యాయిని అయిన ప్రధానోపాధ్యాయులు జి.శాంతి మరియు పాఠశాలలో హిందీ బోధన లో విశిష్ట సేవలు అందిస్తున్న వి.హేమలత, టి.రాజేశ్వర రావు లను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుచింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన.రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, సూర్యకుమారి, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పలాస, సెప్టెంబరు 12(వార్త):** ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేందుకు ముఖ్యమంత్రి సహాయనిధని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు 10 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం పలాస తెలుగుదేశం కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష లబ్దిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది కాలం లో 34 మందికి రూ.32 లక్షల చెక్కులను అందజేసినట్టు ఆమె తెలిపారు. పేదలకు సంక్షేమం, అభివృద్ధి అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఎంత కష్టమైనా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మందస మండలానికి చెందిన మడియ తవిటయ్య, గురకల మోహిత్ కృష్ణ, సబర బాలకృష్ణ లకు, పలాస మండలం చెందిన కొండల శ్యామ్, కొత్తపల్లి రామారావు, గిన్ని పొట్టమ్మలకు చెక్కులను అందజేశారు.

## లోకేష్ చొరవతో నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు విముక్తి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(వార్త):** నేపాల్ లో జరగతున్న హింసాత్మక అల్లర్ల నేపథ్యంలో ముక్తినాథ్ యాత్ర లో చిక్కుకున్న తెలుగు యాత్రికుల ను రాష్ట్ర ఐ టి శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చొరవ తో విముక్తి లభించిందని ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. జిల్లా కు చెందిన వారిని ప్రత్యేక విమానంలో తరలించారని అన్నారు. కంబోడియా సైబర్ స్కాం లో చిక్కుకున్న వారిని కూడా రక్షించారని, గతంలో తెలుగుదేశం పార్టీ ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న వారిని సైతం కాపాడారని అన్నారు.

## కిల్లాంలో రూ.కోటితో పనుల ప్రారంభం



**నరసన్నపేట, సెప్టెంబరు 12(వార్త):** కిల్లాం పంచాయతీలో రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సహకారంతో నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ రామన్న, ఉప సర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ నిధులు రూ.కోటి మంజూరు కావడంతో శుక్రవారం రహదారి పనులను ప్రారంభించామన్నారు. సుమారు కిలోమీటర్ మేర నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.త్వరితగతిన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## 16న వీరఘట్టం మండల సమావేశం

**వీరఘట్టం, సెప్టెంబరు 12(వార్త):** ఈనెల 16న ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ ధమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన వీరఘట్టం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు సమావేశానికి జిల్లా పరిషత్, మండల పరిషత్ సభ్యులు సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు అలాగే అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ సమావేశానికి హాజరవ్వాలని ఎంపీడీవో కోరారు.

## విద్యార్థులకు హోంవర్క్ తప్పనిసరిగా ఇవ్వాలి

**జలుమూరు, సెప్టెంబరు 12(వార్త):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా హోంవర్కు ఇవ్వాలని ఎంఈఓ 2 వర ప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం ఆయన జలుమూరు మండలం ఈదులవలస ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్కులను, హోంవర్క్ లను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. రీడింగ్, డిక్టేషన్ ప్రతిరోజు నిర్వహించాలని ప్రాథమిక స్థాయి నుంచి దీన్ని ఓ అలవాటుగా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రేరణమిత్ర ప్రాజెక్టుకు పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపిక



**పలాస, సెప్టెంబరు 12(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్రస్థాయిలో ప్రేరణ మిత్ర పైలెట్ ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన 30 మంది విద్యార్థులకు శుక్రవారం కళాశాల నందు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, శ్రీనివాసరావు, ఎంఈవో ఆర్.అప్పారావు, జి.గొల్ల, జె.శంకర్, బీసీడీఏ కోఆర్డినేటర్ ఆర్.దీపకుమారి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## ఖైనీ, గుట్కా కాల్చివేత

**జి.సిగడాం, సెప్టెంబరు 12(వార్త):** జి.సిగడాం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ మధుసూదనరావు, వీఆర్వోలు పోట్నూరు జగన్నాధం, రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సుమారు రూ.48 వేల విలువ చేసే ఖైనీ, గుట్కాపాన్ పరాగ్ కాల్చివేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ రవాణా, అక్రమ వ్యాపారుల వద్ద పట్టుబడి పాత కేసులకు సంబంధించిన ఖైనీ, గుట్కా ప్యాకెట్లు కాల్చి ధ్వంసం చేశామని తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా పెంచి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి



**మందస, సెప్టెంబరు 12(వార్త):** మందస మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆదివాసీ మహిళా శక్తి అధ్యక్షులు, వీఓలను ఉద్దేశించి కుల దూషణ చేసి, ఏపీఎం పైడి కూర్మారావు అవమానకరంగా వ్యాఖ్యలు చేశారని గిరిజన నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు ఎంపీడీవో కార్యాలయ ఏఓ బి.రుషేశ్వరరావు, మందస పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గిరిజనులకు లోన్స్ ఇవ్వకూడదని, ఇస్తే జల్సా చేస్తున్నారని, గొర్రెలంటూ మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కులాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఏపీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామని పలువురు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా శక్తి అధ్య క్షురాలు సవర కాంతమ్మ, ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు జగన్, గిరిజన సంఘ నాయకులు ధర్మారావు, ప్రభాకర్, పంచాయతీ సీఎఫ్‌లు దేవి, పద్మావతి, హేమలత, వీఓలు లత, హేమలత, రాజేశ్వరి,శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బోధనలో మరింత మెలకువలు అవసరం



**జలుమూరు, సెప్టెంబరు 12(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన విధానంలో మరింత మెలకువలు పాటించవలసిన అవసరం ఉందని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం వరప్రసాదరావు తెలిపారు. శుక్రవారం జలుమూరు మండలం గుండువలస ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. ఈ మేరకు విద్యార్థుల వర్క్ బుక్కులు, హోంవర్క్ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు కృష్ణారావు పాల్గొన్నారు.

## తెట్టంగి విద్యార్థులకు కిట్లు పంపిణీ

**వీరఘట్టం, సెప్టెంబరు 12(వార్త):** తెట్టంగిలోని యూపీ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వైకాపా సీనియర్ నేత, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సుమతి దంపతులు తమ కుమారుడు ముఖేష్ జయంతి సందర్భంగా కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. 185 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.18 వేల విలువ చేసే ప్లాంక్‌లు, జామెట్రీ బాక్సులు, పెన్నులతో పాటు మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దూసి నాగమణి, యూపీ పాఠశాల హెచ్ఎం గోవిందరావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



# ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

**-మండల సమావేశంలో**

**ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు**






**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(వార్త):** రైతులకు యూరియా పంపిణీ చేయడంలో రాజకీయం చేస్తూ ఎరువుల సరఫరా లో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ పై చర్చ లో ఏవో ఆజయ్ కుమార్ మండలానికి 140 క్వింటాలు యూరియా వచ్చిందని రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఈ విషయంపై మాజీ ఎంపీపీ కారంగి మోహన్ రావు, మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, మండలంలో కూటమి నాయకులకు అనుకూలమైన చోట ఎరువులు నిల్వ చేసి వారికే పంపిణీ చేశారని ఇతర రైతులు కు ఎరువులు అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు.సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ జిల్లాలో కేవలం 40 శాతం మాత్రమే ఎరువులు పంపిణీ చేసారని,వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లా కు యూరియా ఇవ్వలేకపోవడం దారుణమని అన్నారు. ఇదే విషయం పై మాజీ ఎంపీపీ దక్కత ఏకాంబరీ దేవి ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై జడ్పీ చైర్ పర్సన్ విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు కావలసిన ఎరువులు అందం లేకపోతున్నారని ఎద్దేవా చేశారు. వచ్చిన ఎరువులు టిడిపి నాయకులకే అందిస్తున్నారని ఎరువులు పంపిణీలో రాజకీయాలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రైతులకు కావలసిన ఎరువులు అందజేయలేని ప్రభుత్వం రైతులకు ఎలాంటి మేలు చేస్తుందని జడ్పీ చైర్ పర్సన్ విమర్శించారు. ఎరువులు సకాలంలో అందజేయకపోతే రైతులు ఎలా పంటలు పండిస్తారని ప్రశ్నించడంతో ఏకాంబరదేవి మాట్లాడుతూ వరి పంటకు యూరియా ఎప్పుడెప్పుడు వేస్తారో తెలుసా అని ఏక వచనం తో సంభోధించారు. ఈ విషయం పై ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఏకాంబరి పై తప్పు పట్టారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి నియోజకవర్గానికి ఏమి చేశారని, బాహుద నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగకుండా చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం ఇంటింటికి తాగునీరు అందించేందుకు 800 కోట్ల రూపాయలు తో చర్యలు చేపట్టిందాన్నారు. వెలుగు ఎపిఎం ప్రసాద్ మహిళా సంఘాల రుణాల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని చక్రవర్తి రెడ్డి కోరారు. ఒడిస్సా కి చెందిన వారికి ఆంధ్రాలో రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుంటూ రేషన్ కార్డులు చేస్తున్నారని ఈ విషయంపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏకాంబరిదేవి తహసిల్దార్ వెంకటరావును కోరారు మండలంలో రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు తెలియజేశారు . ఈ సమావేశంలో ఎంపీడీవో కె రామారావు, ఇతర శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఏపీటీఎఫ్ వినతి




**మందస, సెప్టెంబరు 12(వార్త):** నిరసన వారంలో భాగంగా మందస మండల ఏపీటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు మందసలో నిరసన తెలిపి, తహసీల్దార్ మిస్క శ్రీకాంత్‌కు మెమొరాండం అందించారు. ఉపాధ్యాయులను బోధనకే మాత్రమే పరిమితం చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం తొలగించాలని, 12వ పీఆర్సీని నియమించాలని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని ప్రకటించాలని, మెమో 57 అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఏఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, సుందరరావు, కార్యవర్గ సభ్యులు వైకుంఠరావు, మురళీమోహన్, చిరంజీవి, ఢిల్లేశ్వరరావు, ప్రభాకర్ పట్నా యక్, నారాయణరావు, హమీద్, రామారావు, రామారావు, గంగాధరరావు, మల్లేశ్వ రరావు, కృష్ణారావు, ఉదయ్, ఖగేశ్వరరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరి, జానకమ్మ, జగన్నాథం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో 1.70 కోట్ల రూపాయల 15 వ ఆర్థిక సంఘం నిధులు తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులు కు ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాలం అశోక్ భూమి పూజ నిర్వహించారు. పురుషోత్తపురం లో 23 లక్షల తో సి సి రోడ్డు పనులు,ఏ ఎస్ పేట లో 24 లక్షలతో రోడ్డు,కాలువల నిర్మాణం,4మరియు 5 వార్డు లో 15 లక్షలు,6,7,10 మరియు 11 వార్డు లో రూ.27 లక్షలు,16 మరియు 17 వార్డు లకు రూ.20 లక్షలు,15 వ వార్డు లో రూ.20 లక్షలు,22 వ వార్డు లో 8.లక్షల రూపాయలు,రత్తకన్న లో రూ.22 లక్షల రూపాయలు,12 వ వార్డు లో 20 లక్షల రూపాయల తో చెప్పట్టనున్న పనులు కు భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ రమేశ్, తవిటయ్య, కోటి, కాళ్ల దిలీప్,సాలిన ఢిల్లీ, గేదల శేఖర్, ధర్మరాజు, కొండ శంకర్ రెడ్డి, సిపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతు భరోసా కేంద్రం తరలింపు సరికాదు



**జలుమూరు, సెప్టెంబరు 12(వార్త):** ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీముఖలింగం గ్రామంలో ప్రధాన సమస్యలను పరిష్కరించమని శుక్రవారం డిఆర్ఓ వెంకటేశ్వరరావు కి వినతి పత్రం అంధజేయ్సిన నాయుడుగారి రాజశేఖర్. ఈ సంధర్భంగా అయనా మట్లాడుతు పాతిక లక్షల రూపాయలు నిధులతో శ్రీముఖలింగం లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మూసివేసి గ్రామసభ తీర్మానం లేకుండా పక్క గ్రామమైన శివన్నారాయణ పురం తరలించడం ఎంతవరకు సమంజసం? తక్షణమే మా గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని రైతులకు. ఉపయోగపడేలా తిరిగి పునః ప్రారంభించాలని కోరాటం జరిగింది అని, అదే విధంగా శ్రీముఖలింగం దేవాదాయ శాఖ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి? అన్నాది రీ సర్వే చేయిమణి స్థానిక ఎమ్మార్వో కి ఆదేశించాలని కోరడం జరిగింది అని సామాజిక కార్యకర్త మరియు వరల్డ్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడుగారి రాజశేఖర్ తేలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నిరసన

**వీరఘట్టం, సెప్టెంబరు 12(వార్త):** ఏపీటీఎఫ్ వీరఘట్టం మండల శాఖ ఆధ్వ ర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్‌సీని వేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



# జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి సరఫరా

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**-కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన**



**పలాస, సెప్టెంబరు 12(వార్త):** జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.పలాస మండలంలోని శాసనం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం లో భాగంగా ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటుకు 92.40 లక్షల విలువతో పలాస ఎమ్మెల్యే గౌత శిరీష పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమ్మతితో ప్రతి ఒక్క పనిని సక్రమంగా నిర్వర్తిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రజల దాహార్చన తీర్చే వారు లేకపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడి చంద్రబాబు పాలనపై ప్రజలు ఆసక్తితో చూస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అంటే మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని అన్నారు. అంతకుముందు మండలంలోని తర్లకోట గ్రామంలో 58.40 లక్షలతో ఇంటింటికి కొళాయి ద్వారా మంచినీటి సరఫరా శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, పలాస పిఏసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, పలాస మాజీ ఎంపీపీ దల్లి లక్ష్మి, దువ్వాడ సంతోష్, పి విట్టల్ రావు, కుత్తుం లక్ష్మణరావు, దాసరి తాతారావు, సవర రాంబాబు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్రీడలతో మానసిక ఉల్లాసం

**మందస, సెప్టెంబరు 12(వార్త):** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పలువురు వక్తలు అన్నారు. గుడారిరాజమణిపురం(వీరగున్నపురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి బాల, బాలికల ఆటల పోటీల ఎంపికలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. క్రీడాకారులుగా మంచి ప్రతిభ చూపితే, వారికి ఎంతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కుండపోతగా వర్షం కురిసినా, ప్రతికూల పరిస్థితుల్లో కూడా స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహకరంగా ఎంపికలు జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో బ్యాడ్మింటన్‌లో 12 మంది, కబడ్డీలో 32మంది, యోగాలో 16మందిని డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రమణమూర్తి, పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు ఎస్.రామారావు, ఇతర ఉపాధ్యాయ బృందం, జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.తవిటయ్య, జోన్-1 పి.ఇ.టి అసోసియేషన్ సెక్రటరీ పి.గజేంద్రరావు, పలు పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో డివిజన్ స్థాయి ఎంపికలు బొడ్డపాడు, కాశీబుగ్గ, పలాసలో జరుగుతాయని పీడీ రామారావు చెప్పారు.

## విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్ మృతి



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 12(వార్త):** కిష్టుపురం గ్రామ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ తగిలిన చెట్టు కొమ్మలను తొలగించటానికి వెళ్లిన జలుమూరు మండలం టెక్కలిపాడులో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మన్ మామిడి సురేష్ (33) విద్యుత్ షాకుతో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మృతుడు సురేష్ జలుమూరు మండలానికి చెందిన పలువురు విద్యుత్ సిబ్బందితో కలిసి తమ మండలానికి వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ సరఫరా నిలుపుదల చేసి, ఆ లైన్‌కు తగిలిన చెట్టు కొమ్మలను కమ్మకత్తితో తొలగించి తిరిగి వెళ్లి పోతున్న సమయంలో పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ కమ్మకత్తికి తగలడంతో విద్యుత్ షాకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు.

## భక్తుల నుంచి అక్రమ వసూళ్లు చేయవద్దు: ఈవో



**జలుమూరు, సెప్టెంబరు 12(వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువైన శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానము నందు అన్నదానం పేరు చెప్పి కొంత మంది వ్యక్తులు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అన్నదానం కొరకు విరాళాలు వసూళ్లు చేయుట నిబంధనలకు విరుద్ధమని ఆలయ ఈవో వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు, సిబ్బంది అనధికారంగా వసూళ్లు చేయవద్దన్నారు. క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

## శ్రీరామ క్షేత్రంలో కుంకుమ పూజలు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 12(వార్త):** తిరుమలతిరుపతి దేవస్థానం అధ్వర్యంలో మండలం ఊడికలపాడు శ్రీరామ మందిరంలో శుక్రవారం సాయంత్రం టిటిడి పురోహితులు శ్యామసుందర్, ప్రసాద్లు మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించారు. గడిచిన నాలుగు రోజులు శ్రీరామమందిరంలో టిడిడి ఆధ్వర్యంలో భక్తులకు పురాణ ప్రవచన కారులు బొడ్డేపల్లి అప్పలనాయుడు, భగవద్గీత ప్రవచన కారులు సనపల కరుణ్కుమార్లచే ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గ్రామస్థులచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెండ తిరుపతిరావు, హనుమంతు వెంకటరావు, సనపల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా కొలతలు తీసుకోవాలి



**జలుమూరు, సెప్టెంబరు 12(వార్త):** సైరిగాం గ్రామంలో స్వామిత్వ సర్వేను డిఎల్పిఓ గోపీబాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వేలో ఇంటి కొలతలను పక్కగా తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వాటిని ఆన్లైన్ చేసి ప్రాపర్టీ కార్డులను అందించాలని సూచించారు. సర్వేకు సహకరించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## 22వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు వీకే పేటలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించారు. కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ ప్రారంభించారు. గతంలో ప్రీ స్కూల్ పరిధిలో విలీనం చేసిన కేంద్రాన్ని వేరుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యకర్త కుండల సురేఖ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## సిమ్స్ బాపిస్ట్ చర్చి150 వసంతాల వేడుకలు




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(వార్త):** సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకల్లో ముఖ్య అతిథిగా ఇచ్ఛాపురం యువ వ్యాపారవేత్త, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ డా.ప్రత్తి అన్వేష్ పాల్గొని ప్రసంగించారు. కమిటీకి, సంఘానికి శుభాకాంక్షలు తెలిపి ప్రభువు మహిమలో గొప్ప కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ వేడుకలకు అనేకమంది దైవ సేవకులు, పెద్దలు, నాయకులు, విశ్వాసులు తరలివచ్చి దైవ దీవెనలు, ఆశీర్వాదాలు పొందారు.

## డివిజన్ స్థాయి పోటీలకు నడుమూరు విద్యార్థులు

**మందస, సెప్టెంబరు 12(వార్త):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి ఎంపికల్లో నడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు చక్రధరరావు తెలిపారు. గొనకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్ పోటీలలో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. పలాస వేదికగా ఈ నెల 15న డివిజన్ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది, గ్రామ ప్రజలు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాబూరావు పాల్గొన్నారు.



# 40 కేజీల గంజాయితో బీహార్ దంపతుల అరెస్టు

**పలాస, సెప్టెంబరు 12(వార్త):** గంజాయి అక్రమ రవాణా చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, దంపతులను అదుపులో తీసుకున్నామని జి ఆర్పి సీఐ ఏ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పలాస రైల్వే స్టేషన్లో గల జిఆర్పి స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన రైల్వే స్టేషన్లో నిర్వహించిన సాధారణ తనిఖీలలో పలాస నుండి సంత్రాగచ్చికు ట్రైన్లో గంజాయి రవాణా చేయడానికి సిద్ధమవుతున్న దంపతులు ఇద్దరు నిందితులను జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బీహార్ కి చెందిన సజాద్ అన్సారీ, జూలి ప్రవీణ్ అని జి ఆర్ పి సీఐ తెలిపారు. లగేజ్ బ్యాగులలో 40 కిలోల గంజాయిను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు. మరో ఇద్దరు నిందితుల్ని అరెస్ట్ చేయాల్సి ఉందని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. ఈయన తో పాటు జి ఆర్ పి ఎస్ ఐ మాల్యాద్రి, సిబ్బంది ఉన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546